క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు.. డొమెస్టిక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, క్యాచె ప్రాపర్టీస్, యూఎస్ కాన్సులేట్, ఇంటర్‌గ్రాఫ్, హుడా లేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, ప్రకాష్‌నగర్, పేస్ హాస్పిటల్, గురుమూర్తిలేన్, మోతీలాల్ నెహ్రూనగర్, ఎయిర్‌కార్గో, భగత్‌సింగ్‌నగర్, శ్యాంలాల్‌బిల్డింగ్స్, ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్‌బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

రేపు డాన్‌బాస్కోలో 'క్యాంపస్ డ్రైవ్'

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ ఆధ్వర్యంలో ఈ నెల 11న మోతీనగర్–ఎర్రగడ్డ మార్గంలోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఐవాన్‌వాజ్, స్టీవన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ జాబ్ డ్రైవ్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు పదో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్, ఆపై విద్యార్హత కలిగిన వారు హాజరు కావాలని మరిన్ని వివరాలకు 94946 98219, 94940 92219 నంబర్లను సంప్రదించాలన్నారు.

సికింద్రాబాద్ తహసీల్దార్‌గా పాండు నాయక్



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ తహసీల్దార్‌గా నియమితులైన ఇస్లావత్ పాండు నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన శైలజ ఇటీవల జరిగిన బదిలీల్లో మేడ్చల్ మండలానికి బదిలీ చేయగా నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలంలో పనిచేస్తున్న ఈయన సికింద్రాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రధాన ఉద్దేశమని, ముందుగా ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో వాటిని గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతామన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే వారికి సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన



రసూల్‌పురా: అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరశురాం ఆరోపించారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు అన్నానగర్‌లో ఆయన పర్యటించారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్‌లు పింఛన్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయలేదని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వార్డు అధ్యక్షుడు కనకరాజు, ప్రేమ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఉస్మానియా యూనివర్సిటీ: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం సచివాలయాన్ని ముట్టడించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై పోలీసుల దాడికి నిరసనగా ఓయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బుధవారం ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, గిరిజన శక్తి, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌ల కోసం పోరాడుతున్న విద్యార్థి నాయకులకు అన్యాయంగా దాడులు చేయించిన డీసీపీ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు స్పందన



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత స్కాలర్‌షిప్ పరీక్షలకు స్పందన లభించింది. ఏకం ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు దాదాపు 800 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, ఏకం ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీలేఖ అబ్బూరి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. యూపీఎస్సీ శిక్షణ కోసం ఎదురు చూసే పేద విద్యార్థులకు ఉచితంగా అవకాశం కల్పించడం కోసం ఈ పరీక్ష నిర్వహించినట్లు శ్రీలేఖ అబ్బూరి తెలిపారు. స్కాలర్‌షిప్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచిత యూపీఎస్సీ శిక్షణ, వసతి ఏర్పాట్లు కల్పిస్తామన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రద్దీ ప్రాంతాల్లో సిబ్బంది విధులు నిర్వహించేలా కృషి

- రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వారిని ఉపేక్షించం
- 'సాక్షి'తో మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పడాల ఉప శంకర్



బన్సీలాల్‌పేట్: ట్రాఫిక్ సమస్యల నివారణకు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నాం. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తున్నామని మహంకాళి ట్రాఫిక్ నూతన ఇన్‌స్పెక్టర్ పడాల ఉప శంకర్ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌లో పని చేసిన ఉప శంకర్ పదోన్నతిపై మహంకాళి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రజలు ఇబ్బంది పడ కుండా రోడ్లపై వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా ప్రణాళికలను రూపొందించి అమలు చేయనున్నట్లు వివరించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై మాట్లాడారు.

ప్రశ్న: మీ పరిధిలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు..సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇన్‌స్పెక్టర్: ముఖ్యంగా ఆర్పీ రోడ్డు, ప్యాట్నీ చౌరస్తా–బైబిల్ హౌస్, కర్బలామైదాన్, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఉంటుంది. అయితే సదరు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా ఎప్పటికప్పుడు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నాం.

ప్రశ్న: వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది వీటిపై తీసుకుంటున్న చర్యలు..

ఇన్‌స్పెక్టర్: వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా జరిగే చోట అనేక మంది రోడ్లపై కార్లు, ఇతరత్రా వాహనాలను పార్కు చేయడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో తమ సిబ్బంది ద్విచక్ర వాహనాలపై సంచరిస్తూ సదరు వాహనాలకు చలాన్లు వేయడంతో పాటు అక్కడి నుంచి తొలగిస్తున్నారు. మరోసారి రోడ్లపై వాహనాలను పార్కు చేయకుండా చూస్తున్నాం.

ప్రశ్న: రోడ్లపై వాహనాలు తనిఖీ చలాన్లు వేస్తున్న తీరు ఏ విధంగా ఉంది?

ఇన్‌స్పెక్టర్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చలాన్లు వేస్తున్నాం. ముఖ్యంగా మైనర్లు రోడ్లపై వాహనాలు నడపకుండా వారి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నాం. పెద్ద ఎత్తున చలాన్లు ఉండి తప్పించుకొని తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తున్నాం. ప్రజల భద్రత కోసమే తాము తనిఖీలు చేస్తున్నాం.

ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్ తీరు తెన్నులు..

ఇన్‌స్పెక్టర్: తమ పరిధిలో వారానికి రెండు సార్లు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎంతో మంది తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. దీన్ని అరికట్టడానికే తప్ప ప్రజలకు ఇబ్బంది కలిగించడానికి కాదనే విషయాన్ని వాహనచోదకులు గ్రహించాలి. పట్టుపడిన వాహనచోదకుడిని కోర్టులో హాజరు పరుస్తున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తూ, ఫొటోలు తీయడం చలాన్లు వేయడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి వాటి గురించి..

ఇన్‌స్పెక్టర్: నిబంధనలు ఉల్లంఘించే వాహనచోదకుల ఫొటోలు తీయడం చలాన్లు వేయడం విధి నిర్వహణలో భాగమే. సిబ్బంది వాహనదారులు, ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించి తమ ఇష్టానుసారంగా సిబ్బంది ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రజా సమస్యలపై తీసుకుంటున్న చర్యలు

ఇన్‌స్పెక్టర్: ప్రజా సమస్యలపై సకాలంలో స్పందిస్తాం. వాహనచోదకులు, ప్రజలు ఎవరైనా ట్రాఫిక్‌కు సంబంధించిన సమస్యలపై తమ వద్దకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించడంతో పాటు ఓ ఫోన్‌కాల్‌తో స్పందిస్తాం. ప్రజలకు సేవ చేయడం బాధ్యతగా భావించి ఆ దిశగా ముందుకు సాగుతాం.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు



చెక్కులు అందజేసిన పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్ మండల పరిధిలో 36 మందికి మంజూరైన షాదీముబారక్ చెక్కులను బుధవారం సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మారేడుపల్లి తహసీల్దార్లు వెంకటలక్ష్మి, పద్మ సుందరి, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునిత, లింగాని ప్రసన్నలక్ష్మి, కంది శైలజ, బీఆర్‌ఎస్ నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

తహసీల్దార్లతో సమావేశం..

సికింద్రాబాద్: దళారిల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తహసీల్దార్లను ఆదేశించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులపై బుధవారం ఆయన రెవెన్యూ అధికారులతో సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శక విధానాన్ని ప్రభుత్వం పాటిస్తుందని, ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అంబర్‌నగర్ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో పాటు రెవెన్యూ సమస్యలపై చర్చించారు.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

అడ్డగుట్ట: ఉచిత నిర్బంద విద్యాహక్కు చట్టం అమలు చేసి విద్యార్థుల హక్కులను కాపాడాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్పీఎఫ్) మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా లేదని ఆరోపించారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఉపాధ్యాయులు లేరన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ జరగడం లేదని వివరించారు. మండల పరిధిలోని 148 మంది పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని, వారిని విముక్తి చేసి బాలకార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల ఉల్లంఘన కాకుండా తక్షణమే ప్రభుత్వం వీటిని అమలు చేసే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీఆర్పీఎఫ్ మండల కన్వీనర్ ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, రమాదేవి, అజయ్ బాబు, మల్లేష్, రత్నకుమార్, భాస్కర్ ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య పాల్గొన్నారు.

అభివృద్ధి నిధుల్లో సింహభాగం సీసీ కెమెరాలకే

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పోలీసు అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: సీసీ కెమెరాల ప్రాధాన్యం గుర్తించి తన నియోజకవర్గ అభివృద్ధి నిధులలో అత్యధిక శాతం సీసీ కెమెరాల ఏర్పాటుకు కేటాయిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం సచివాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నూతన సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో దేశంలో హైదరాబాద్ నగరం ప్రథమ స్థానంలో ఉందన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో వందశాతం సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి గతేడాది రూ.84 లక్షలను కేటాయించగా, ఈ ఏడాది రూ.50 లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి, మహంకాళి, బేగంపేట, ఎస్‌ఆర్‌నగర్, గాంధీనగర్ ఏసీపీలు రవీందర్ యాదవ్, రామలింగరాజు, చంద్రశేఖర్, రవికుమార్, సీఐలు రాంప్రసాద్, పరశురాం, రవి పాల్గొన్నారు.

ఇళ్ల ఫ్రీ హోల్డ్‌కు మంత్రికి వినతి..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ పరిసర ప్రాంతాల్లో లీజ్ ల్యాండ్ ఇళ్లను ఫ్రీ హోల్డ్ చేయాలని బుధవారం స్థానిక బస్తీ, కాలనీ వాసులు మంత్రి తలసానికి వినతిపత్రం ఇచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి నిరుపేద వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు ఇక్కడ జీవనం సాగిస్తున్నాయని, అయితే ఇళ్లు ఇంత వరకు ఫ్రీ హోల్డ్ కాలేదన్నారు. బోయిగూడ కీస్ బ్లాక్, సున్నంబట్టీ, బొక్కలగూడ ప్రాంతాల్లో సుమారు 142 ఇళ్లు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నుంచి జీవనం సాగిస్తున్న ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. జీరా తరహా మీ ఇళ్లు కూడా ఫ్రీ హోల్డ్ అవుతాయని చెప్పారు. సుధాకర్, విజయ్, వినోద్, శ్రీధర్, రాజేష్, అంథోని, గజ్జెల శ్రీనివాస్, సురేష్ ఉన్నారు.

పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం



పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న లాస్య నందిత, నివేదిత

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్న మంజూరు చేసిన నిధులతో కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు కార్ఖాన ఈద్గా సమీపంలో పవర్ బోర్‌వెల్ పనులను బుధవారం సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు తన తండ్రి సాయన్న పవర్ బోర్‌వెల్ ఏర్పాటుకు నిధులు మంజురు చేశారని ఆ నిధులతో దశలవారీగా ఆయా ప్రాంతాల్లో పవర్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులో మూడు నుంచి నాలుగు పవర్ బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనితా ప్రభాకర్, శ్రీనివాస్, పనససంతోష్, నిత్యానంద్, అఖ్తర్ మీర్జా, గౌస్, అహ్మద్, అక్బర్, జావేద్, దర్శన్, హమీద్, పూరన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఆదివాసీ భాషా, సంస్కృతిపై పరిశోధనలు జరగాలి



సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసీ స్టూడెంట్ ఫోరం (ఏఎస్‌ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ సాగబోయిన పాపారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై ఆదివాసీల ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివాసీ భాషా, సంస్కృతిపై విస్తృతంగా పరిశోధనలు జరగాలన్నారు. ప్రొ.అప్కా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడిన వాదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నేడు హరిహర కళాభవన్‌లో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి రాష్ట్ర గవర్నర్ తమిళి సై హాజరవుతారని విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అంతకు ముందు ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ఆదివాసీల సాంప్రదాయ గుసాడి, డోలు నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎఫ్ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు మడావి అజయ్, పూనెం వివేకవర్ధన్, అధ్యాపకులు అనురాధ, కిశోర్, ఏఈడబ్ల్యూసీఏ జాతీయ అధ్యక్షులు గొంది వెంకటరమణ, మహిళా చైతన్య శక్తి రాష్ట్ర మహిళ నేత వెంకటరమణచ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న నాగయ్య, గోపాల్ రెడ్డి

కంటోన్మెంట్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలని బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య అన్నారు. సీతారాంపూర్‌లోని సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్కూలు కేబినెట్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే నాయకత్వ లక్షణాలతో పాటు, టీమ్ వర్క్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్, సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ చామకూర గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, సాంస్కృతి రంగాలు, వక్తృత్వ పోటీల్లో ప్రావీణ్యం సాధించేలా బోధన సాగుతుందన్నారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం సమాజంలో వివిధ రంగాల్లో కీలకంగా రాణిస్తుండటం గర్వంగా ఉందన్నారు. డైరెక్టర్ ఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగేశ్వరి, లిజీ బెనెడిక్ట్, పీఈటీలు ప్రసాద్, దాస్, మహేందర్ పాల్గొన్నారు.

మహాధర్నాకు భారీ జనసమీకరణ చేయాలి



సమావేశమైన శ్యామ్‌సుందర్‌గౌడ్

అమీర్‌పేట: డబుల్ బెడ్రూమ్‌ల సమస్యలపై నిర్వహించే మహాధర్నకు పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకున్న వారందరిని గుర్తించి నెల 12న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాకు తరలించాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు చేసుకున్న ఎంతో మంది నిరుపేదల ఇళ్ల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వ అందరికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమర వీరుల కుటుంబ సభ్యులను సత్కరించి మహాధర్నాను ప్రారంభిస్తారని తెలిపారు. సారంగపాణి, కార్పొరేటర్లు సరళ, సుచిత్ర, దీపిక, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

గద్దర్, జహీరుద్దీన్‌ల మరణం తీరని లోటు



గద్దర్, జహీరుద్దీన్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: పీడిత ప్రజల గొంతుకలు గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌ల మరణం సమాజానికి తీరని లోటని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం అడ్డగుట్టలోని జీఎం అంజయ్య విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో గద్దర్, జహీరుద్దీన్ చిత్రపటాలను ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గద్దర్, జహీరుద్దీన్‌లు తమ తుది శ్వాస వరకు పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తమ మాట, పాటల ద్వారా నిలదీస్తూ అట్టడుగు వర్గాల ప్రయోజనాల కోసం ఉద్యమించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వీరిరువురి పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. వారి ఆలోచనలను ముందుకు తీసుకుపోవడమే అసలైన నివాళి అని వెల్లడించారు. యాదగిరి, రంజిత్, గౌరి నాగరాజు, ఖాజా మియా, శంకర్, ఖాసిం, బాలరాజు, రామస్వామి, కొండయ్య, నరసింహ, అంబేద్కర్, వెంకటేష్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి

లాలాపేట: నేటితో ముగియనున్న గృహ లక్ష్మి పథకం దరఖాస్తు గడువును మరికొన్ని రోజుల పాటు పొడిగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు బెజ్జాల కృష్ణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల నుంచి ప్రజలు మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద దరఖాస్తులు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో బారులు తీరుతుండగా మరికొందరు వివిధ ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

మారియట్‌లో మిల్లెట్ ఫుడ్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ఐరాస ప్రకటించిన నేపథ్యంలో ఐటిసి హోటల్స్‌కు చెందిన మారియట్ హోటల్స్‌లో మిల్లెట్ ఆహారం ప్రత్యేక మెనూ అందిస్తున్నట్టు నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మల్టీ మిల్లెట్ అండ్ టర్మరిక్ లూఫ్, పెర్ల్ మిల్లెట్ ఫోకస్సియా, ఫాక్స్‌టైల్ మిల్లెట్ అండ్ కేరెట్ బ్రెడ్ తదితర బ్రెడ్స్‌తో పాటు ఫింగర్ మిల్లెట్, జాగరీ పాన్ కేక్, రాగి ఫ్లోర్ ఖాండ్వీ, జాక్ ఫ్రూట్ మిల్లెట్ హలీమ్, పెర్ల్ మిల్లెట్ రిసొట్టో విత్ ప్రాన్స్, పికిల్డ్ టమాటో, చికెన్, పెర్ల్ మిల్లెట్ ఈ మెనూలో అందిస్తున్నామని వివరించారు.

దుకాణ నిర్వాహకుడికి జైలు

అమీర్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా షాపు నిర్వహిస్తూ సమస్యలు సృష్టిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామప్రసాదరావు వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన మహ్మద్ లతీఫ్ స్థానికంగా టీ, పండ్లరసాల దుకాణం నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి దాటినా షాపు నడుపుతూ సమస్యలు సృష్టించడంతో పలుమార్లు పెట్టీ కేసులు నమోదు చేశారు. అయినా అతనిలో మార్పు రాలేదు. తాజాగా మరో కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 10వ మెట్రోపాలిటన్ ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్‌రావు నిందితుడికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

రాంగోపాల్‌పేట్: తెలంగాణాలోని నిరుద్యోగ యువతకు వెంటనే నిరుద్యోగ భృతిని చెల్లించాలని బీజేవైఎం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు, యువత, విద్యార్థులు ఎన్నో పోరాటాలు చేశారని తెలంగాణ ఏర్పడితే తమ బతుకులు మారతాయని ఉద్యోగాలు వస్తాయని కోటి ఆశలతో ఉండగా పదేళ్లు గడిచినా నేటికి ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్య, నిరంకుశ వైఖరి అవలంభిస్తుందని వెంటనే నిరుద్యోగ భృతిని చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ కుమార్, పవన్ పటేల్, శివాజీ గోపి, రాజు, రఘురాం, మహేష్, అజయ్ యాదవ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పెంచాలి



అమీర్‌పేట: ఆయుష్ వైద్య విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెకు బీజేపీ కార్పొరేటర్ మద్దతు తెలిపారు. అమీర్‌పేటలోని గాంధీ నేచురోపతి కళాశాల ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఐదురోజుల నుంచి చేపడుతున్న సమ్మెకు బుధవారం అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014లో ఇచ్చిన జీవో ప్రకారం ఆయుర్వేద పీజీ, జూనియర్ వైద్యులకు ప్రతీ రెండేళ్లకోసారి ఉపకార వేతనాలు 15 శాతం పెంచి ఇవ్వాలని కాని ఇప్పటి వరకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన



అమీర్‌పేట: న్యాయ పరిష్కారం కోసం కోర్టులకు వెళ్లలేని వారికి ఉచితంగా న్యాయ సేవలు పొందే వీలుంటుందని మెట్రో పాలిటన్ న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా బుధవారం అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. సమాజంలో బలహీన వర్గాలకు న్యాయాన్ని పొందే అవకాశాలు నిరాకరించబడకుండా చూసేందుకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నారని చెప్పారు.ఉచిత సేవలు కావాలనుకునే బాధితులెవరైనా నాంపల్లిలోని అథారిటీస్ కార్యాలయం లేదా పారా లీగల్ వలంటీర్ అనంతరెడ్డిని సంప్రదించాలని సూచించారు.బాపూనగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మేరీ మిట్టి మేరా దేశ్'



సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం 'మేరీ మిట్టి మేరా దేశ్–మిట్టి కో నమన్, వీరవ్ కో వందన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్మీ హవల్దార్ వినాయక పాండురంగం, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు ఏకే పాండే, దీపక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి మాట్లాడుతూ.. మన స్వేచ్ఛ, ప్రశాంత జీవనానికి దేశ సైనికులు తమ ప్రాణాలర్పిస్తున్నారని అలాంటి సైనికులను సన్మానించుకోవడం మన బాధ్యత అన్నారు. కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన హవల్దార్ వినాయక పాండురంగంతో పాటు సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వసుధ, కేంద్ర యూత్ ఆఫీసర్ కుష్బూ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మాధురి, డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

12న మణిపూర్ బాధితులకు సంఘీభావంగా ధర్నా



రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో జరుగుతున్న దాడుల్లో బాధితులుగా ఉన్న వారికి తాము అండగా ఉంటామని సంఘీభావం తెలుపుతూ ఈ నెల 12న ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ (టీసీసీ), తెలంగాణా క్యాథలిక్ బిషప్స్ కౌన్సిల్(టీసీబీసీ) ప్రకటించింది. బుధవారం రెజిమెంటల్‌బజార్‌లోని సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ బిషప్ కార్యాలయంలో వివిధ క్రైస్తవ సంఘాల ప్రముఖులతో ధర్నా నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీసీ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ టీ భాస్కర్, టీసీబీసీ డిప్యూటీ సెక్రటరీ ఫాదర్ రాజు అలెక్స్‌లు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా తెలంగాణాలో వివిధ సంఘాలు, చర్చిలు, సంస్థలు ఎవరికి వాళ్లు నిరసన ప్రదర్శనలు, తదితర కార్యక్రమాలతో వివిధ రకాలుగా మణిపూర్ బాధితుల పక్షాన నిలిచి సంఘీభావం ప్రకటించారని తెలిపారు. అయితే భారీ ఎత్తున క్రైస్తవ సమాజం మొత్తం ఐకమత్యంతో మరోసారి బాధితులకు భరోసా ఇచ్చేందుకు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించ తలపెట్టామని చెప్పారు. క్రైస్తవ నాయకులు రాబర్ట్ సూర్యప్రకాష్, బాల్‌రెడ్డి, స్లీవా గెలేలీ మార్టిన్ మైఖేల్, థామస్ జాన్, డేవిడ్ పాల్గొన్నారు.